క్లుప్తంగా

ధనలక్ష్మీదేవిగా భ్రమరాంబ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న నక్షత్రదీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మల్లేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకాలను వైభవంగా చేశారు. సహస్రలింగార్చన, ప్రత్యేక హోమాలు జరిగాయి. ధనలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతులు ఇచ్చారు. అనంతరం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీసేవ చేశారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి షణ్ముగం నటరాజన్ పర్యవేక్షించారు.

గోతులు త్వరగా పూడ్చండి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆయా ప్రాంతాల్లో రోడ్లపై గోతులను త్వరితగతిన పూడ్చాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఇంజినీరింగ్ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంతలు లేని నగరంగా విజయవాడను మార్చాలన్నారు. నగరంలో ఉన్న రోడ్లపై గుంతలను, ప్రతి వార్డ్‌లో పూడ్చుకుంటూ, వార్డుల వారీగా ఒకవైపు గుంతలను మరో వైపు డ్రైన్ మరమ్మతులు పూర్తి చేయాలన్నారు.

దుర్గమ్మ చెంత భక్తి సంగీతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తిరుపతికి చెందిన మన సంస్కృతి కళా సంస్థకు చెందిన కళాకారులు భక్తి సంగీతాన్ని ఆలపించారు. కె.రెడ్డెప్ప పర్యవేక్షణలో నాగమణి, రుక్మిణి, రాజశేఖర్, మోగిత్వేరి, గీతతో పాటు పలువురు కళాకారులు కీర్తనలను ఆలపించారు. కళాబృందానికి భక్తుల ప్రశంసలు అందాయి. అనంతరం భక్త బృందం సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం డీఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

మంత్రి సత్యకుమార్ ముస్లింలకు క్షమాపణ చెప్పాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): హజ్ యాత్రపై శాసనమండలిలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ముస్లిం సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మాట్లాడారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రను కించపరుస్తూ పెద్దల సభలో అమాత్యుడు వ్యాఖ్యానించడం చూస్తుంటే ఆయన మంత్రి ఎలా అయ్యారో అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఇదే సామెత ఇతర మతాల మీద మాట్లాడతారా అని ప్రశ్నించారు. మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా మాట్లాడటం, సామెతలు వల్లివేయటం మానుకోవాలని హితవు పలికారు. అనంతరం 41వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మైనార్టీలంటే చిన్నచూపని, మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యలే అందుకు నిదర్శనమన్నారు. హజ్ అనే పదం అన్‌పార్లమెంటరీ అని తెలియక పోవడం ఆయన అజ్ఞానానికి తార్కాణన్నారు. ఆయన అహంకారపూరిత, అభ్యంతరకర వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేయటంతో మాటను వెనక్కి తీసుకుంటానని చెప్పటం మంత్రిగా తగదని అన్నారు.

సైన్స్ అంశాలు అర్థమయ్యేలా చూడాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయులు ప్రయోగాల ద్వారా సైన్స్ అంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలని జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ప్రయోగశాలలను మైనం హుస్సేన్ పరిశీలిస్తున్నారు. నగరంలోని వివిధ పాఠశాలల్లోని ప్రయోగశాలలను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఫ్రైడే-ఒక ప్రయోగం నినాదంతో సైన్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు అందరు సైన్స్ ఉపాధ్యాయులు బోధన మెరుగు పరచుకోవాలన్నారు. లైట్, కరెంటు, మెకానిక్స్, కెమికల్ రియాక్షన్, ఆసిడ్ అండ్ బేస్, కార్బన్ కాంపౌండ్స్, మెటల్ అండ్ నాన్ మెటల్ అంశాలు నిత్యాజీవిత ఉపయోగాలు చెప్పాలన్నారు. విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించడానికి తీర్చిదిద్దాలని కోరారు.

పట్టని ఆరోగ్య కేంద్రాలు

- ఆధునిక సౌకర్యాలున్నా..అందని సేవలు
- నగం కేంద్రాల్లో వైద్యులే లేరు
- నియామకంపై దృష్టి సారించని ప్రభుత్వం

లబ్బీపేట(విజయవాడతూర్పు): గత ప్రభుత్వం.. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం యూపీహెచ్‌సీలను పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం రాష్ట్రంలో పీహెచ్‌సీలు అధునాతన భవనాల్లో ఏర్పాటు చేశారు. అత్యాధునిక పరికరాలను సమకూర్చింది. వీటిని వినియోగించుకుని పట్టణపేదలకు నాణ్యమైన సేవలు అందించడంతో కూటమిప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అంతేకాదు నగం ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో లేకున్నా, భర్తీ చేయాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దీంతో వైద్యం పొందేందుకు పేదలు పెద్దాస్పత్రిలకు పరుగులే తీయాల్సిన దయనీయ స్థితి నెలకొంది. కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఉంటే మందులు అరకొరగా ఉంటున్నాయని, వ్యాక్సిన్‌లు కూడా లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




గతంలో ఆధునిక వసతులతో నిర్మించిన యూపీహెచ్‌సీ (ఇన్‌సెట్) లబ్బీపేట ఆరోగ్య కేంద్రంలో గత ప్రభుత్వం సమకూర్చిన అధునాతన పరికరాలు

గత ప్రభుత్వంలో సౌకర్యాల కల్పన

నగరంలో 41 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 12 కేంద్రాలకు గత ప్రభుత్వం అధునాతన భవన నిర్మాణాలు చేపట్టారు. అందులో భాగంగా ఒక్కో భవనాన్ని రూ. కోటితో నిర్మించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో సుమారు రూ.50 లక్షలు విలువైన వ్యాధి నిర్ధారణ పరికరాలను కూడా సమకూర్చారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, కంప్యూటర్ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ గ్రేడ్ వర్కర్ ఇలా ఏడుగురు సిబ్బందిని నియమించి, సేవలు పక్కాగా అందేలా చర్యలు తీసుకున్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా నివాస ప్రాంతానికి సమీపంలోనే సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు.

యూహెచ్‌సీలపై నిర్లక్ష్యం

ప్రస్తుత ప్రభుత్వం యూహెచ్‌సీలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. పట్టణ పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. అంతే కాదు నగరంలో సగం ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులే లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఒక్కో వైద్యుడు రెండు ఆరోగ్య కేంద్రాల్లో ఉండాల్సి దయనీయ స్థితి ఎదురవుతోంది. దీంతో ఏ సమయంలో ఎక్కడ విధులు నిర్వహిస్తారో తెలియడం లేదు. వైద్యులు పోస్టులు భర్తీ చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కొన్నింటిలో స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్ కూడా ఉండటం లేదు.

మందుల కొరత

పట్టణఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మందులు ఉండటం లేదు. గత ప్రభుత్వ హయాంలో 182 రకాల మందులు ఉండేవి. ఇప్పుడు తరచూ మందుల కొరత నెలకొంటున్నట్లు సిబ్బందే చెబుతున్నారు. రక్త పరీక్షలు చేసేందుకు వైద్యుడు ఉంటే.. టెక్నీషియన్ ఉండటం లేదని, టెక్నీషియన్ ఉంటే వైద్యుడు ఉండటం లేదంటున్నారు. దీంతో చేసేది లేక పెద్దాస్పత్రిలకు పరుగులు తీస్తున్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి



లబ్బీపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో కొంతకాలంగా వైద్యుడే ఉండటం లేదు. పటమట కేంద్రంలో పనిచేసే డాక్టర్‌ను ఇక్కడ కూడా విధులు నిర్వహించేలా ఆదేశాలిచ్చినా, ఏ సమయంలో ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రోగులు వైద్యం కోసం వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేసి నాణ్యమైన సేవలు అందించాలి.

– సయ్యద్ అలీం, కో ఆప్షన్ సభ్యుడు

సామాజిక వికాసంలో మహిళల పాత్ర కీలకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సామాజిక వికాసంలో మహిళల పాత్ర కీలకమని కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు అన్నారు. ఆ కళాశాల యూజీసీ ఉమన్ స్టడీస్ సెంటర్ రూపొందించిన 'ఉమన్ ఎంపవర్‌మెంట్ ఇన్ ఇండియా.. ఉమన్ యాజ్ అర్కిటెక్ట్ ఆఫ్ ప్రోగ్రెస్' పుస్తకాన్ని శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో పాటు చాలాచోట్ల మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. మహిళా సాధికారతపై వివిధ కోణాల్లో చేసిన పరిశోధనను గ్రంథంగా తీసుకువచ్చిన యూజీసీ స్టడీసెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ షమీమ్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించారు. తెలుగు వ్యాసరచనలో ఎల్ చాముండేశ్వరి, ఇంగ్లిష్ వ్యాసరచనలో ఎస్. నవీననంద, తెలుగు కవర్‌పేజ్ డ్రాయింగ్‌లో జి. హెలెన్, ఇంగ్లిష్ కవర్‌పేజ్ డ్రాయింగ్‌లో డి. ప్రవల్లికలు విజేతలుగా నిలిచారు. వారికి ప్రిన్సిపాల్ ఎస్. పద్మజ శుక్రవారం బహుమతులు అందజేశారు.

రేపు ఆర్య వైశ్య కార్తిక వన సమారాధన

భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం సందర్భంగా ఈ నెల 24న భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులోని బబ్బూరి గ్రౌండ్‌లో ఆర్య వైశ్య కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు వీవీకే నరసింహారావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం బబ్బూరి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవాసవి ఫౌండేషన్, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్య వైశ్య సంఘం, అర్బన్ జిల్లా మహిళా విభాగం, ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్య వైశ్య ఆత్మీయ సమ్మేళనం (కార్తిక వనసమారాధన) నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ వ్రతంలో సుమారు 1,500 మంది దంపతులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్య వైశ్య ప్రముఖులు నూకల నాగేశ్వరరావు, జూలూరి వెంకటేశ్వరరావు, నంబూరు ప్రదీప్, సింహాద్రి గోపి, అయ్యప్ప, సతీష్, బొగ్గరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మల్లేశ్వరుడికి డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ



స్వామి వారికి విశేష అలంకరణ



సహస్ర లింగార్చన చేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి శుక్రవారం పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు విశేష అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చనను శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ జరిగాయి

మాతా శిశు సేవల్లో ప్రగతి సాధించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య సిబ్బంది మాతా శిశు సేవలు, ఎన్‌సీడీ-సీడీ సర్వే-3లో ప్రగతి సాధించి లక్ష్యాలు చేరుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు, మెనూ నిర్వాహణ వంటి అంశాలను తనిఖీ చేశారు. పిల్లలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ బిల్లల పంపిణీని అడిగి తెలుసుకున్నారు. వ్యాధుల నియంత్రణపై సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు.

అధికారులతో సమీక్ష

జిల్లా ప్రోగ్రాం అధికారులతో నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పలు అంశాలపై డాక్టర్ సుహాసిని సమీక్ష నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రగతి, మాతా శిశు సంరక్షణ సేవలు లక్ష్యాలను చేరుకోవడం, ఈ ఆశా యాప్ నిర్వాహణ వంటి అంశాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవీనాయుడు, డాక్టర్ పద్మావతి, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, డాక్టర్ బాలాజీ, గణాంక అధికారి లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీ(నాస్కామ్) ఏపీ, తెలంగాణ రీజినల్ హెడ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని శ్రీ దుర్గమల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం టెక్‌స్పార్క్స్ 2కె 24 పేరుతో రాష్ట్రస్థాయి టెక్నికల్ ఈవెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథి ప్రవీణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్, సేవల పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తూ, పరిశ్రమల ప్రమాణాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపునకు వివిధ సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వానికి పరిమితులుంటాయి

ఎమ్మెల్యే సుజనా చౌదరి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు అన్ని పనులు ప్రభుత్వం చేయటానికి సాధ్యపడదని, కొన్ని పరిమితులు ఉంటాయని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా)చౌదరి పేర్కొన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎన్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సీడ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ, సుజనా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.3లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, రూ.10లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డిజిటల్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెరిట్ స్టూడెంట్స్‌కు స్కాలర్‌షిప్‌లు, అలాగే స్కూల్‌కు మేథ్స్, ల్యాబ్ కిట్‌ను అందచేశారు. కార్యక్రమంలో సీడ్స్ సంస్థ వ్యవస్థాపకుడు ఆర్‌సీఎం రెడ్డి, డీఈఓ సుబ్బారావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బీవీ రమణ, కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మహదేవు అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

దుర్గా బ్యాంక్ బాధిత డిపాజిటర్లకు నిరాశ

స్కూల్‌లో కార్యక్రమానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి వస్తున్నారని తెలుసుకుని ఆయన్ని కలిసి వినతి పత్రం ఇద్దామని వచ్చిన దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బాధిత డిపాజిటర్లు నిరాశకు గురయ్యారు. స్కూల్ గేట్ బయట బ్యానర్ పట్టుకుని నిలబడ్డ బాధితులు ఎమ్మెల్యే వెళ్లిపోయేటప్పుడు కలిసి తమ సమస్య చెప్పుకుందామని ఎదురు చేశారు. అయితే ఎమ్మెల్యే కార్యక్రమం ముగించుకుని గేటు లోపలే ఉన్న కారు ఎక్కటంతో బాధితుల్లో ఇద్దరు కారు వద్దకు వెళ్లి వారి గోడును వినిపించారు. దీంతో ఆయన ఇప్పటి వరకు ఏం చేశారు.. అయినా గత ఎమ్మెల్యేను ఎందుకు అడగ లేదని ఎదురు ప్రశ్న వేశారు. తాము ఇటీవలే సంఘంగా ఏర్పడ్డామని బాధితులు చెప్పగా రెండు నెలలు ఓపికపట్టాలని, రిజర్వ్ బ్యాంక్‌తో మాట్లాడతానని చెప్పినట్లు బాధితులు తెలిపారు.

28న కవన విజయం సాహిత్య రూపకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 28వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కవన విజయం పేరుతో ఆధునిక సాహిత్య రూపకం, 30 తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో రాజమండ్రికి చెందిన గాడేపల్లి వెంకట్ బృందం తిరుమంగై ఆళ్వార్ దివ్య కథ పేరుతో కూచిపూడి నృత్య రూపక ప్రదర్శన నిర్వహిస్తారని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కార్యక్రమాలను తిలకించవచ్చని పేర్కొన్నారు.

నగరాభివృద్ధికి నిరంతర కృషి



మేయర్ అధ్వర్యంలో జరిగిన వీఎంసీ స్థాయీసంఘ సమావేశం

- మేయర్ భాగ్యలక్ష్మి
- కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీసంఘ సమావేశం

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత అభివృద్ధి చేయటానికి నిరంతరం కృషి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యాన స్థాయీసంఘం సమావేశం జరిగింది. సమావేశంలో మొత్తం 20 అంశాలు ప్రతిపాదన రాగా అందులో 18 అంశాల్ని ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరించారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో పక్షపాతం లేకుండా అభివృద్ధి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు సమీకరిస్తామన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు, స్థాయీసంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలు ఇవి

- వీఎంసీ పరిధిలోని ఆయా డివిజన్లలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయటానికి, రోడ్లు స్వీపింగ్ చేసిన తర్వాత వచ్చే వ్యర్థాల పోగులను లోడర్ పాయింట్‌వద్దకు చేర్చేందుకు డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికులకు అందించే మూడు చక్రాల ట్రాలీలు తయారీ, సరఫరా చేయటానికి రూ. 74.71 లక్షల అంచానాలను వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించి, ఖర్చు చేసేందుకు వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.
- నగరంలోని 64 డివిజన్లలో వచ్చే వ్యర్థాలను క్లాప్ వాహనాలు, కాంపాక్టర్ బిన్స్ ద్వారా నగరంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు వ్యర్థాల తరలింపు జరుగుతుంది. ప్రస్తుతం ఉన్న కాంపాక్ట్‌బిన్స్ పూర్తిగా తుప్పుపట్టాయని, వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే రూ. 48.03 లక్షలు వ్యయాన్ని వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

పోషకాహారంతో చక్కని ఆరోగ్యం



మాట్లాడుతున్న చిత్తా విజయశ్రీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థినులు పోషకాహారంతో చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోగలరని న్యూట్రిషియన్ చిత్త విజయశ్రీ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఐసీసీ విభాగం ఆధ్వర్యంలో 'శరీర పోషణతో శక్తివంతమైన మనస్సు' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ మంచి ఆహారాన్ని తీసుకుంటే మనిషి భౌతికంగా శక్తివంతంగా మంచి ఆలోచనలతో దృఢంగా ఉంటారన్నారు. కలుషితమవుతున్న ఆహార పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాలు, ఆకుకూరలు వంటి పదార్థాలను అధికంగా తీసుకుంటే చాలా సమస్యలకు దూరంగా ఉండవచ్చన్నారు. యోగా ద్వారా శరీరానికి మరింత బలాన్ని చేకూర్చవచ్చని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు లక్ష దీపోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కార్తిక మాసం సందర్భంగా ఈ నెల 24వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు మొగల్రాజపురం రావి చెట్టు సెంటర్‌లో ఆవు పేడతో తయారు చేసిన ప్రమిదలతో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామని నారాయణీ సేన చైర్మన్, లక్ష దీపోత్సవ కార్యక్రమ కమిటీ కన్వీనర్ పిట్టల గోవింద్ చెప్పారు. దీపోత్సవ కరపత్రాన్ని విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. గోవింద్ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ విజయవాడ మహానగర్, నారాయణి సేన సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి హాజరై కార్తిక మాస విశిష్టత వివరిస్తారని చెప్పారు. దీపోత్సవంలో పాల్గొన్న వారికి కాశీ నుంచి తెచ్చిన రుద్రాక్ష అందజేస్తామని చెప్పారు. దీపోత్సవంలో పాల్గొనదలచిన వారు 77949 78373 నంబరులో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ పడాల శ్రీనివాస్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, నారాయణీ సేన సంస్థ సభ్యులు కరపత్రం ఆవిష్కరణలో పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన



పూలతో చేసిన ఆకృతులను పరిశీలిస్తున్న విద్యార్థినులు



పుష్పాలతో అలంకరించి గణేశ్ ఆకృతిని తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నగర పాలక సంస్థ, అర్బన్ గ్రీనరీ, ఉద్యానవనశాఖ సహకారంతో నాలుగు రోజుల పాటు నిర్వహించే ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ప్రదర్శనలో వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి విచ్చేసిన చామంతులు, గులాబీలు, మందార, నారింజ, మామిడి, జామ, ఫల, పుష్ప మొక్కలతో పాటు, కుండీల్లో, ఇంట్లో అలంకరణగా ఏర్పాటు చేసే మొక్కలను వివిధ స్టాల్స్‌లో ఏర్పాటు చేశారు. ప్రదర్శనలోని పలు మొక్కలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు.

ప్రముఖ ఉద్యానవనాలకు చెందిన వారంతా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శనలో తొలిరోజు విద్యార్థులకు ఫ్లవర్ రంగోలి పోటీలు నిర్వహించగా, పలు పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థినులు విచ్చేసి, ఆకర్షణీయమైన పువ్వులతో రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ రోజ్ సొసైటీ సభ్యులు ఎస్.ఉషారాణి, జి.లక్ష్మి, ఎన్.పద్మప్రియ, ఎ.రత్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

• 27న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంబమూర్తి రోడ్డులోని అయ్యప్ప స్వామి మందిరంలో ఈ నెల 27వ తేదీ శ్రీమణికంఠ భక్త బృందం ఆధ్వర్యాన సామూహిక శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.